# పొమ్మనలేక పొగపెడుతున్నారా..?

## నినాదంలో బీసీ వాదం.. ఆచరణలో మనువాదంగా వ్యవహరిస్తున్న బిజెపి


“

అంగట్లో అన్ని ఉన్నా.. అల్లుని నోట్లో శని అన్నట్టు అన్న చందంగా మారింది బీజేపీ పరిస్థితి. దేశంలో భారతీయ జనతా పార్టీకి ఉనికే లేని రోజుల్లో తెలంగాణలో ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో బలమైన పార్టీగా బీజేపీ ఉనికి చాటుకున్న విషయం తెలిసిందే. దేశంలో కేవలం ఇద్దరే ఎంపీలు ఉంటే అందులో తెలంగాణ నుండి ఒక ఎంపీ స్థానాన్ని గెలిచి సత్తా చాటుకున్న చరిత్ర తెలంగాణ ప్రాంత బీజేపీకి ఉంది. బీజేపీకి తల్లివేరులాంటి రాష్ట్రీయ స్వయం సేవక్ సంస్థలో అనేక మంది కార్యకర్తలు గడిచిన 50 ఏండ్లుగా ప్రచారక్‌లుగా దేశ వ్యాప్తంగా పని-స్తున్నారు. ఇప్పటికే బీజేపీ నుండి కేంద్ర మంత్రులుగా, గవర్నర్,ఇంకా అనేక కీలక స్థానాల్లో అనేక మంది ప్రముఖులు బాధ్యతలు నిర్వహించారు.అనేక బలిదా-నాలు,త్యాగాలతో పార్టీ నిర్మాణం కోసం తమ సర్వస్వాన్ని త్యజించించిన చరిత్ర భారతీయ జనతా పార్టీ కార్యకర్తలది. వామపక్ష రాజకీయాలు బలంగా ఉన్న తెలంగాణ లాంటి ప్రాంతం లో బీజేపీ రాజకీయాలు మాట్లాడటమే సాహసంగా ఉన్న రోజులో కూడా బీజేపీ అనేక మంది కార్యకర్తలు పార్టీకోసం తమ జీవితా-లను త్యాగం చేశారు. తెలంగాణ లో పార్టీ ఉనికిలో ఉన్న రోజులో కనీసం బీజేపీ అలికిడి కూడాలేని రాష్ట్రంలో ఆ పార్టీ అధికారం లోకి రావడం, తెలంగాణలో మాత్రం నామమాత్రంగానే మిగిలిపోవడాన్ని ఆ పార్టీ కార్యకర్తలే జీర్ణించుకోలేని పరిస్థితి.

తెలంగాణలో మాత్రమే సిద్ధాంతాలు ,సూత్రాలు..
దేశంలో ఎక్కడలేని నిబంధనలు, నిర్మాణ సూత్రాలు తెలంగాణ లో మాత్రమే బీజేపీ ఆచరణలో పెడుతుంది. తన భావజాలం కానీ పార్టీల నేతలు బీజేపీలో చేరితే , చేరిన నాటి నుండి నిఘా వేయడం, అవమానించడం లాంటి చేష్టలతో చాలా మంది నేతలు అపార్టీకి దూరమవ్వగా చేరుదామని నిర్ణయం తీసుకున్న నేతలు స్థానిక నేతలు వ్యవహారశైలితో తమ నిర్ణయాలను వెనక్కి తీసుకున్న పరిస్థితి. గతం లో నాగం జనార్ధన్ రెడ్డి,కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి,గడ్డం వివేక్,యన్నం శ్రీనివాస్ రెడ్డి లాంటి అనేకమంది సినియర్ నేతలు బీజేపీ కి గుడ్ బై చెప్పారు.బీజేపీ లో చేరుదాము అనుకున్న పొంగులేటి, జూపల్లి లాంటి నేతలు బీజేపీ లో నేతల తీరుతో ఆపార్టీ గడప తొక్కకుండానే వెనుతిరిగారు.కేరళ,బెంగాల్ లో వామపక్ష నేతలు బీజేపీచేరి కీలక పాత్ర పోషిసున్నారు.ఉత్తర ప్రదేశ్,బీహార్,మధ్య ప్రదేశ్‌లో సమజ్వాదీ, బిఎస్పి నేతలు బీజేపీ లో మంత్రులు,పార్టీ నేతలుగా రాణిస్తున్నారు.తెలంగాణ లో మాత్రం ఇతర పార్టీ నేతలకు చెక్ పెడుతున్నారు.

బీజేపీ నేతల వ్యవహార శైలి..
బీజేపీ పార్టీ ఢిల్లీ లో బలంగా ఉన్నప్పుడు మాత్రమే తెలంగాణ గల్లీలో ఉనికిలో ఉంటుంది.కేవలం ఢిల్లీ నేతల గ్లామర్ పై మాత్రమే తెలంగాణ బీజేపీ నేతలు ఆధారపడి ఉండటం అపార్టీకి సంబంధించినంత వరకు పెద్ద విషాదం. పార్టీ విస్తరణ కోసం స్థానిక స్థానిక నాయకత్వానికి సరైన కార్యాచరణ ఆచరణ లోపం కారణంగా ఆ పార్టీ ఎదుగుదల మందకోడిగా మారింది కేవలం ఢిల్లీ స్థాయి నేతలనే నమ్ముకుని స్థానికంగా కార్యకలాపాలు పరిమితం కావడం విశేషం పార్టీని తనదైన శైలిలో స్థానిక తెలంగాణ పరిస్థితుల కు అనుగుణమైన కార్యాచరణకు తెలంగాణ బిజెపి ఎన్నడు నోచుకోలేదు కేవలం ఆర్ఎస్ఎస్ భావజాలం ఉన్న కొద్దిమంది మాత్రమే ఆయానిర్మాణాలపై పరిమితమై తమ కార్యచరణను కొనసాగిస్తున్నారు తెలంగాణలో బిజెపి క్యాడర్ కన్నా రాష్ట్రీయ స్వయం సేవక్ సంగ్ కార్యకర్తలే బలంగా ఉన్నారు కేవలం పరివార క్షేత్రాల కార్యకర్తలతోటే బిజెపి నేతలు "మమ" అనిపించడం తంతుగా సాగుతున్న స్థితి సొంతంగా రాజకీయపరమైన నిర్మాణాన్ని బిజెపి ఏర్పాటు చేసుకోవడంలో తీవ్రమైన వైఫల్యాన్ని చెవి చూస్తోంది కేంద్ర పార్టీ రాష్ట్రస్థాయిలో అనేకమందికి కీలకమైన అవకాశాలు ఇచ్చినప్పటికీ వాటిని అనుభవించిన అంతగా పార్టీ విస్తరణకు కృషి చేయకపోవడం ప్రధాన లోపంగా కనిపిస్తుంది

మాటల్లో బీసీ వాదం.. ఆచరణలో మనువాదం..
గడిచిన శాసనసభ ఎన్నికల్లో బీసీ వాదం పేరుతో ఎంతో హడావిడి చేసిన భారతీయ జనతా పార్టీ తీరా ఎన్నికలు ముగిశాక బీసీ వాదాన్ని అటకెక్కించింది ప్రముఖ బీసీ నేత తెలంగాణలో అత్యధిక జనాభా ఉన్న ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన మాజీ మంత్రి ఈటల రాజేందర్‌ను బిజెపి రాష్ట్ర అధ్యక్షునిగా నియమిస్తారన్న ప్రచారం బాగా వినిపించింది. బిజెపిలో ఇప్పుడున్న అనేకమంది నేతల్లో సీనియర్ శాసనసభ్యుడే కాకుండా ప్రజాదరణ ఉన్న నేతగా ఈటెల రాజేందర్ కు గుర్తింపు ఉంది. ఈటలకు పార్టీ పగ్గాలు అప్పగిస్తే తెలంగాణలో బిజెపిని బలోపేతం చేస్తారని అనేక కథనాలు ప్రచారాలు జోరుగా సాగినప్పటికీ చివరికి మాత్రం కథ సుఖాంతం కాలేదు. బీసీ వాదం పేరు చెప్పి ఓట్లు దండుకున్న భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా మాత్రం అగ్రవర్ణాలకు చెందిన నేతకు అవకాశం ఇచ్చి బీసీల పట్ల బీజేపీకి ఉన్న చిత్తశుద్ధిని స్పష్టం చేసింది. నినాదంలో బీసీ వాదం.. ఆచరణలో మనువాదంగా ఆ పార్టీ రాజకీయాలు ఉన్నాయని తెలంగాణ సామాజిక ఉద్యమ శక్తులు ఆరోపిస్తున్నాయి తాజాగా ఈటెల రాజేందర్‌ను బిజెపి నుండి సాగనంపేందుకు పెద్ద ఎత్తున కసరత్తు జరుగుతున్నట్టే కనిపిస్తుంది బిజెపిలో పార్లమెంటు సభ్యుడిగా సీనియర్ నేతగా ఉన్న ఈటెల రాజేందర్ సొంత పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పార్టీ ఉన్నత స్థాయి సమావేశాలఫ్లెక్సీలో ఆయన ఫోటో




లేకుండానే కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆయన్ని అవమానించడాన్ని దీనికి సంకేతంగా చూడవచ్చు. హుజురాబాద్ నియోజకవర్గం పరిధిలో ఈటెల రాజేందర్ కు సంబంధించిన కార్యకర్తలకు పార్టీ నిర్మాణంలో ఎక్కడ భాగస్వామ్యంలో తీసుకోకపోవడాన్ని ఎలా అర్థం చేసుకోగలం వరుస అవమానాలతో తీవ్రమైన రాజకీయ ఉక్కపోతకు గురవుతున్న ఈటెల రాజేందర్‌ను కూడా వదిలించేందుకు ఆ పార్టీ సిద్ధమవుతున్నట్టే కనిపిస్తోంది.

తెలంగాణలో బలపడుతున్న బీసీ వాదం..
తెలంగాణలో మునుపు ఎన్నడూ లేని బీసీ వాదం ఇప్పుడు ఉవ్వెత్తున ఎగిసిపడుతోంది. మలిదశ తెలంగాణ ఉద్యమంలో అనేక సంస్థలు వ్యక్తులు వివిధ ఉద్యమపాయలుగా ఏర్పడి తెలంగాణ ఉద్యమాన్ని ఎక్కడెక్కడ బలమైన పునాదులు వేసినట్టుగానే నేడు బీసీ సమాజంలో కూడా ఎక్కడికక్కడ సమాలోచనలు జరుగుతున్నాయి. నాడు ఉద్యమ శక్తులన్నీ కూడగట్టి తెలంగాణ ఉద్యమానికి కెసిఆర్ నాయకత్వం వహించినట్టే నేడు బిసి ఉద్యమాన్ని ఏకతాటి పైకి తీసుకువచ్చి నాయకత్వం వహించే చారిత్రక బాధ్యత ఈటెల రాజేందర్ లాంటి సీనియర్ నేతలపై ఉంది. రాజకీయ మత్తు నుండి బయటపడి తాను పూర్వ ఆశ్రమ రాజకీయాలను అవలోకనం చేసుకుంటే.. మరో చారిత్రాత్మకమైన రాజకీయ చరిత్రను నిర్మించే బాధ్యత ఈటెల రాజేందర్‌కు రాజకీయంగా కలిసి వచ్చే అవకాశం ఉంది. తెలంగాణ రాజకీయాల్లో దేవేందర్ గౌడ్ తర్వాత అంతటి స్థాయి గుర్తింపు గౌరవం ఉన్న నేతగా ఎదిగొచ్చిన ఈటల రాజేందర్ తన ఆలోచనలకు పదును పెడితే గొప్ప మలుపుకు శ్రీకారం చుట్టవచ్చు. తెలంగాణ రాజకీయాల్లో గేమ్ చేంజ్ కొరకు ఎదురుచూస్తున్న యావత్ సమాజానికి ఈటల రాజేందర్ దారి దీపం అవుతారు. రాజకీయాల్లో అఫెన్స్, డిఫెన్స్‌లు మాత్రమే ఉంటాయి. ఈటల బిఆర్ఎస్ లో చేసింది డిఫెన్స్ పాలిట్రిక్స్ ఇప్పుడు చేయాల్సింది అఫెన్స్ పాలిట్రిక్స్. నిర్ణయం ఆయనదే చరిత్రలో టార్చ్ బేరర్ అయ్యే అవకాశాలు చరిత్ర అందరికి ఇవ్వదు .తేల్చుకోవలసింది ఈటల రాజేందరే.



- దొమ్మాట వెంకటేష్
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్,
9848057274

# వివాహేతర సంబంధాలపై ద్వంద్వ నీతి



వివాహేతర లైంగిక సంబంధాలు కలిగిన పురుషుడిని విలాస పురుషుడు, మగ మహారాజు, శృంగార పురుషుడు, ప్లేబాయ్ అంటూ సమాజం పొగుడుతుంది. ఆయన గారు కితాబులు అందుకుంటూ ఉంటాడు. వాడు మగాడు అంటూ...స్త్రీలోలత గొప్ప పురుష లక్షణమని ప్రశంసలు సైతం పొందుతాడు. కానీ స్త్రీ విషయంలో..ఈ నీతి తలకిందులైపోతుంది. పురుష లైంగిక విశృంఖలతను ప్రశంసించిన సమాజం స్త్రీ పట్ల పూర్తిగా భిన్నమైన, వైఖరిని, వివక్షా పూరితమైన నీతిని వ్యతిరేక వైఖరిని ప్రదర్శిస్తున్నది. వివాహేతర లైంగిక సంబంధాలు కలిగిన స్త్రీని సాని, వెలయాలు,బజారు మనిషి లాంటి నిందలు వేస్తున్నది. అడుగడుగునా నిందలు,అవమానాలు, ఈసడింపులు, చీత్కారాలను ఆ స్త్రీ ఎదుర్కో వలసి వస్తున్నది. ఇదొక విచిత్రమైన సామాజిక నీతి, స్థితి. అనుమానం లేకుండా ఇది ద్వంద్వ నీతే అవుతుంది. వేద వ్యాసుడి మహా భారతంలో అంబిక, అంబాలిక, కుంతి,మాద్రి వివాహేతర లైంగిక సంబంధాలతో మాత్రమే సంతానం పొందారు. అలా పొందిన సంతానమే మహాభారతంలో ప్రధాన పాత్రలు. వారిలో..దృతరాష్ట్రుడు, పాండురాజు, విధురుడు, కర్ణుడు,ధర్మరాజు, భీముడు,అర్జునుడు, నకులుడు, సహదేవుడు ముఖ్యులు. ఒకరి కంటే ఎక్కువ మంది స్త్రీలను వివాహం చేసుకునే అవకాశం నాటి కాలంలో పురుషులకు ఉండేది. అలాగే ఒకరి కంటే ఎక్కువ మంది పురుషులను వివాహం చేసుకునే అవకాశం వీలు కూడా నాటి స్త్రీలకు ఉండేది. పురుషులకు ఉండేంత విస్తృత వెసులుబాటు స్త్రీలకు లేకపోయినా, బహు భర్తుత్వానికి ఓ మేరకు అవకాశాలు బాగానే ఉండేవి. స్త్రీ పురుష లైంగిక సంబంధాల్లో అది నాటి సామాజిక సంస్కృతి. ఆ సంస్కృతిలో భాగంగానే ద్రౌపది ఐదుగురు పాండవులను వివాహం చేసుకుంది.

నాటి కాలంలో బహు భార్యత్వం,బహు భర్తుత్వాలకు సామాజిక ఆమోదం ఉండేది. ఆ క్రమంలోనే ద్రౌపదికి ఐదుగురు పాండవులు భర్తలయ్యారు. కానీ చిత్రంగా..ఐదుగురు భర్తలు కలిగిన ద్రౌపది అనేక మార్లు అవమానాల పాలైంది. వివాహేతర బంధాలతో కలిగిన తన తండ్రి పుట్టుక నేపథ్యాన్ని మరచిపోయిన దుర్యోధనుడు గురివింద నీతిని ప్రదర్శించి అవమానించి తన దర్బారులో ద్రౌపదిని వివస్త్రను చేశాడు. అపార మైన ప్రాణ, ఆస్తి నష్టాలన మిగిల్చినకురుక్షేత్ర యుద్ధం దాని ఫలితమే.

అలాంటి వివాహేతర బంధాలతోనే సంతానాన్ని పొందిన అంబిక, అంబాలిక,కుంతి, మాద్రి లాంటి ఇంకొందరు స్త్రీలు మాత్రం గౌరవం,మర్యాదలు పొంది గొప్ప పతివ్రతలుగా కీర్తించబడ్డారు. తన పదవిని కాపాడుకునే ప్రయత్నాల్లో తరచూ దేవ వేశ్యలను ఎరవేసే ఇంద్రుడు మాత్రం దేవతల రాజుగా కొనసాగుతూనే ఉంటాడు. ఇంద్రుడికి స్త్రీ లోలుడు అనే ఇంకో అదనపు అర్హత కూడా ఒకటి ఉన్నది. చిత్రంగా..ఏకపత్నీవ్రతుడిగా కీర్తించబడే శ్రీ రాముడితో పాటుగా బహు పత్నీవ్రతుడిగా పేరొందిన
శ్రీకృష్ణుడు కూడా సమాన గౌరవ, మర్యాదలను పొందారు. పొందుతూనే ఉన్నారు. కాలాలు మారిపోయినా నాడైనా, నేడైనా అదే సామాజిక నీతి కొనసాగుతూనే ఉన్నది.

- గందె గోవర్ధన్

# టీఆర్ఎఫ్ ఉగ్రవాద సంస్థేనట




టీఆర్ఎఫ్ ఉగ్రవాద సంస్థనే అని అమెరికా ప్రకటించింది. ఎల్ఈటీ [లష్కరే తోయిబా]కు ముసుగు సంస్థ అని పేర్కొన్నది. టీఆర్ఎఫ్‌గా పిలిచే ది రెసిస్టెన్స్ ఫ్రంట్ ఉగ్రవాద/టెర్రరిస్టు సంస్థనే అని అమెరికా ప్రకటనలోని సారాంశం. 26 గురు అమాయక టూరిస్టులను బలి తీసుకున్న పెహెల్గాం టెర్రరిస్టు దాడి గుర్తుండే ఉంటుంది. ఏప్రిల్ 22న జరిగిన ఆ దాడికి తామే బాధ్యులమని అప్పట్లో టీ-ఆర్ఎఫ్ ప్రకటించింది.

ఎల్ఈటీ అనుబంధంగా పని చేస్తున్న టీఆర్ఎఫ్‌ను విదేశీ ఉగ్రవాద సంస్థ(ఎఫ్‌టీవో)గా అమెరికా ఇప్పుడు నిర్ణయించింది. దాడి తరువాత ఇండియా-పాకిస్థాన్ ల మధ్య తీవ్రమైన ఉద్రిక్తతలు తలెత్తి 12 రోజుల పాటు యుద్ధం జరగడం, ఆ యుద్ధంలో పాకిస్థాన్ లోని టెర్రర్ క్యాంపులపై ఇండియా దాడులు చేయడం, తరువాత యుద్ధం నిలిచిపోవడం తెలిసిన సంగతులే.యుద్ధాన్ని తానే ఆపివేశానని ట్రంపు దొర వారు ప్రకటించడం,అదేమీ కాదు..

పాకిస్థాన్ అభ్యర్థనతో మాత్రమే కాల్పుల విరమణకు ఒప్పుకున్నామని, వెలుపలి వారికి విరమణకు సంబంధం లేదని ఇండియా ప్రకటించడాన్ని చూశాం. కాల్పుల విరమణ అమలు మొదలై ఉద్రిక్తతలు కొంత తగ్గుముఖం పట్టిన తరువాత..యుద్ధంలో వీరోచిత ప్రదర్శన చేశారని పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ మునీర్ గారికి ఆ దేశ ప్రభుత్వం "ఫీల్డ్ మార్షల్" అనే అత్యున్నత కిరీటాన్ని తగిలించి గౌరవించడాన్ని చూశాం. తరువాత... సదరు పాకిస్థాన్ ఫీల్డ్ మార్షల్ గారిని ట్రంప్ గారు వైట్ హౌస్ కు ఆహ్వానించి విందు భోజనం పెట్టి సత్కరించడాన్ని కూడా మనం చూశాం.

ఇప్పుడు తాజాగా అదే నోటితో టీఆర్ఎఫ్ టెర్రరిస్టు సంస్థ అని అమెరికా ప్రకటించడం చిత్రమైన తాజా పరిణామం. ఉగ్రవాద మూలాలు పాకిస్తాన్ లోనే ఉన్నాయని, టెర్రరిజాన్ని ఆ దేశం పెంచి పోషిస్తున్నదని ఒకవైపు చెబుతూనే, ఆ దేశ ఆర్మీ చీఫ్ ను కావలించు కోవడం, ఆయనకు విందు భోజనం పెట్టి సత్కరించడం అమెరికాకు మాత్రమే సాధ్యం. పాకిస్థాన్‌లో ఆశ్రయం పొందిన అల్‌ఖాయిదా సుప్రీమ్ ఒసామా బిన్ లాడెన్ పాకిస్తాన్ లో ఆశ్రయం పొందిన సంగతి అమెరికాకు తెలుసు. అలాంటిది ఏమీ లేదని పాకిస్తాన్ బుకాయించిన సంగతీ అమెరికాకు తెలుసు. అలాంటి స్థితిలో పాకిస్థాన్ కు తెలియకుండా,కనీస సమాచారం ఇవ్వకుండా, ఎలాంటి అనుమతి తీసుకోకుండానే రహస్య వైమానిక దాడుల ఆపరేషన్ ద్వారా లాడెన్ ను చంపి వేసిన వైనాన్ని మొత్తం ప్రపంచం చూసింది. టెర్రరిజం అంతం పేరిట ఆఫ్ఘనిస్తాన్ ఆక్రమించి తిష్ట వేసి రెండు దశాబ్దాల యుద్ధంచేసి వల్లకాడుగా మార్చి వేసి ఏమీ చేయలేక క్రూరమైన తాలిబన్లకే ఆ దేశాన్ని అప్పగించిన వైనాన్ని కూడా ప్రపంచం చూసింది. అలాంటి దేశం ఎవరిని, దేనిని టెర్రరిస్టుగా, ప్రకటిస్తే ఏమిటి? ప్రకటించకుంటే మాత్రం ఏమిటి?ఆ ప్రకటనతో ఒరిగేది శూన్యం మాత్రమే. 80 యేళ్ళ గా ఆ దేశ విదేశీ నీతి ని చూస్తూ అర్థం చేసుకుంటే ఈ ప్రకటనతో టెర్రరిజం అంతమైపోదు. ప్రపంచానికి కనీస మాత్రంగానైనా మేలు జరిగే అవకాశం ఉండదు.



- గందె గోవర్ధన్,
ప్రత్యేక ప్రతినిధి, విశ్వంభర దినపత్రిక
ఫోన్ : 9347056621